సాక్షి ములుగు

సోమవారం | 5 | ఫిబ్రవరి | 2024

మేడారంలో సారలమ్మ గద్దె వద్ద కిక్కిరిసిన భక్త జనం



వనం.. జనం

మేడారానికి పోటెత్తిన భక్తులు

వనం.. జనసంద్రమైంది. చెట్టు.. పుట్ట.. వాగు, వంక.. ఎక్కడ చూసినా మేడారంలో భక్తజన ప్రవాహమే కనిపించింది. ఆదివారం తల్లుల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి వనదేవతల సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 3 లక్షల మంది అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. – ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో ▸



తల్లులకు మొక్కుతున్న భక్తురాలు



బంగారం(బెల్లం) మొక్కుతో వస్తూ..

న్యూస్‌రీల్

కోటగుళ్ల అభివృద్ధికి సహకరిస్తా



గణపురం: మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్ల అభివృద్ధికి తన వంతుగా ఎప్పటికీ సహకరిస్తానని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రోదూరి నవీన్‌కుమార్ అన్నారు. ఆయన కుమారుడు కరణ్ జన్మదినం సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు నరేష్ తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని గోశాల నిర్వహణకు 20వేల రూపాయలు అందించారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



కాటారం: టెన్త్, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని గిరిజన గురుకుల సంక్షేమశాఖ రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ అధికారి(ఏఓ) బి.శంకరయ్య అన్నారు. కాటారం మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలను ఆదివారం ఏఓ తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ విద్యాసంవత్సరం టెన్త్, ఇంటర్‌లో 100శాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. పక్కా ప్రణాళికతో విద్యార్థులను సంసిద్ధులని చేయాలన్నారు. ప్రతి విద్యార్థి 60శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జేకే బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో రాష్ట్ర మహాసభ



భూపాలపల్లి రూరల్: ఫిబ్రవరి 11, 12 తేదీలలో ఖమ్మం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలకు ఉపాధ్యాయులు, మేధావులు, విద్యాభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం జిల్లా శాఖ అధ్యక్షులు బానోతు సేవానాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్ మాట్లాడారు. కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రభుత్వం వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గువ్వాడి జగపతిరావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, నాయకులు గొడిశాల సత్యనారాయణ, కొండ శ్రీనివాస్, దేశిని హరిశంకర్, చంద్రగిరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

'గుర్తింపు' సర్టిఫికెట్ ఇంకెప్పుడు..

భూపాలపల్లి అర్బన్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి నెల రోజులు గడిచినా ఇప్పటివరకు యాజమాన్యం గుర్తింపు సంఘం సర్టిఫికెట్ ఎప్పుడు ఇస్తారని ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో కారుణ్య ఉద్యోగాల నియామకం కోసం అన్‌ఫిట్ అయిన మెడికల్ వీటీసీ కోసం సుమారు 4 నెలలుగా ఎదురు చూస్తున్నా నియామక పత్రాలు ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. ఎక్టర్నల్ క్లర్కులు, కెమిస్టులుగా ఇతర ఉద్యోగాల నియామకాల్లో ఎంపిక చేసి ఒకరోజు విధులకు హాజరైన తర్వాత ఆర్డర్లను రద్దుచేసిన యాజమాన్యం ఇంతవరకు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు రిటైర్డ్ అయి 3 నెలలు గడిచినా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కారుణ్య నియామకాలు ఎప్పుడు ఇస్తారని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, నూకల చంద్రమౌళి, తాళ్ల పోశం, సతీష్, రాములు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



వాహనాలను పార్కింగ్ స్థలాలకు మళ్లిస్తున్న పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అమ్మవార్ల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తారని అంచనాతో ఉన్న పోలీసులు పక్కా ప్రణాళికతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. వెయ్యిమంది పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ శబరీశ్ సీసీ కెమెరాల్లో వాహనాల రాకపోకలను గమనిస్తూ ఊరట్టం, కాల్వపల్లి పార్కింగ్ స్థలాలకు వాహనాలు మళ్లింపు, గద్దెల ప్రాంగణం, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాల పరిసరాలను మేడారం కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు వైర్‌లెస్ సెట్‌లో సూచనలు చేస్తూ 13 ప్రధాన సెక్టార్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించే విధంగా డ్రోన్ కెమెరాతో సమస్యాత్మక ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. సుమారుగా పదివేల వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ స్థలా లకు మళ్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్ కుమార్, ఏఎస్పీ సంకీర్త్, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మేడారం ముచ్చట్లు

శరవేగంగా పనులు

- మేడారంలో యుద్ధ ప్రాతిపదికన మరుగుదొడ్లు, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ వర్క్స్
- త్వరలోనే భక్తులకు తాగునీరు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మహాజాతరకు 16 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. దీంతో వనదేవతలు సమ్మక్క– సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు తాత్కాలిక జీఐ షీట్స్ మరుగుదొడ్లు, తాగునీటికి బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 3న మంత్రి సీతక్క జాతర పనులన్నీ త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ పనులను వారం రోజుల్లో పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు.

ఊపందుకున్న మరుగుదొడ్ల పనులు

మేడారంలో తాత్కాలిక జీఐ షీట్స్ మరుగుదొడ్ల పనులు ఊపందుకున్నాయి. మేడారం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మేడారం జాతర పరిసరాల్లో 279 యూనిట్ల తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. 279 యూనిట్లలో ఇప్పటి వరకు 120 మరుగుదొడ్లకు రేకుల ఏర్పాటు పనులు పురోగతిలో ఉండగా 29 మరుగుదొడ్లకు పూర్తయ్యాయి. పూర్తయిన మరుగుదొడ్లను భక్తులకు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు డీపీఓకు అప్పగించనున్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల పనులను పది రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు.

పూర్తి దశకు చేరుకున్న నల్లాల ఏర్పాటు

మేడారం జాతరలో భక్తుల తాగునీటి కోసం మేడారం, ఊరట్టం, కొత్తూరు, కన్నెపల్లి పరిసరాల్లో 530 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం 435 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేశారు. మిగిలిన వంద నల్లాల పనులు ఐదు రోజుల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు. జాతరకు ముందస్తుగా భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా బుధ, గురు, ఆదివారాల్లో జంపన్నవాగు, చిలకలగుట్ట, హరితహోటల్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నల్లాలకు తాగునీరు సరఫరా చేసేందుకు అంత సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వాటర్ ట్యాంక్ ద్వారా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, ఆర్టీసీ బస్టాండ్, ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రాంతంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు.

10 క్లస్టర్లలో 30 మంది..

మేడారం జాతర పరిసరాల్లో పది క్లస్టర్లలలో తాగునీటి ఏర్పాట్ల పనుల కోసం పది డీఈలను, 20 మంది ఏఈలను నియమించారు. ఒక్కో క్లస్టర్ పరిధిలోని ఒక డీఈ, ఏఈ ఇద్దరు దగ్గరుండి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారు. సీఈ శ్రీనివాస్‌రావు, ఎస్ఈ మల్లేశ్‌లు నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రతిరోజూ క్లస్టర్ అధికారులతో ఒక గంటసేపు సమావేశం నిర్వహించి పనుల పురోగతిని అడిగి తెలుసుకుంటున్నారు. పనుల వేగవంతంపై పలు సూచనలు సలహాలు చేస్తున్నారు. రోజువారీగా పనుల పురోగతిపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తున్నారు.



జంపన్నవాగు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు



మరుగుదొడ్ల వద్ద నీటి వసతిని పరిశీలిస్తున్న అధికారులు

గట్టమ్మతల్లికి మొక్కులు



గట్టమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ములుగు రూరల్: మండలంలోని గట్టమ్మ తల్లిని ఆదివారం మేడారం వనదేవతల దర్శనానికి వెళ్లే భక్తులు దర్శించుకున్నారు. ఆది దేవత గట్టమ్మ తల్లికి భక్తులు చీరె, సారె సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న సమ్మక్క–సారలమ్మ గద్దెలకు పసుపు–కుంకుమలు సమర్పించుకున్నారు. గట్టమ్మ తల్లిని వరంగల్ మల్టీ జోన్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రావు దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ పూజారులు సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు.

పనులు వేగంగా పూర్తిచేయాలి

ఐటీడీఏ పీఓ అంకిత్



మేడారంలోని అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీఓ

ఏటూరునాగారం: మేడారం జాతర సందర్భంగా చేస్తున్న అభివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. ఆదివారం ఆయన మేడారంలో పలు అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మేడారంలోని చిలకలగుట్ట వద్ద జరుగుతున్న వర్చువల్ పెయింటింగ్ పనులు, ఊరట్టం వద్ద పూర్తయిన లోలెవల్ బ్రిడ్జిని పరిశీలించారు. ముఖ్యంగా చిన్నబోయినపల్లి, చల్వాక నుంచి కొండాయి, ఊరట్టం మీదుగా మేడారం రావటానికి ఈ లోలెవల్ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జంపన్న వాగు పరిసరాలలో భక్తులు పుణ్యస్నానాలు చేయటానికి ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేసిన షవర్ బ్యాటరీ ఆఫ్ టాప్స్‌ను పరిశీలించారు. భక్తులకు తాగునీటి సమస్య ఏర్పడకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. మ్యూజియం, మ్యూజియం పక్కన జరుగుతున్న మీటింగ్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో స్వయంభు స్వామివారు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధిగాంచిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు, మేడారం వనదేవతలను దర్శించుకున్న భక్తులు సైతం హేమాచలున్ని దర్శించుకునేందుకు ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంతంలో భక్తజన సందడి నెలకొంది. ఆయా ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేట్ వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ, కారంపుడి పవన్ కుమార్, ఆచార్యులు ఈశ్వర రామానుజ దాస్ స్వామివారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిల తైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు గోత్ర నామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సూర్య

మంగపేట: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మండల పరిధిలోని చుంచుపల్లి(చెంచుపల్లి)లో సమ్మక్క–సారక్క , కొముురంభీం యూత్, కొమురం అబ్బాయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు రెండు జిల్లాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను సూర్య ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడలు, చదువులో ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేని వారికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంటు నిర్వాహకులు సోలం సందీప్, పాయం సచిన్, ఎల్లబోయిన నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా, మండల నాయకులు పూజారి సురేందర్, జగన్‌మోహన్‌రెడ్డి, అయ్యోరి యానయ్య, కాంతారావు, పల్లికొండ యాదగిరి, రామిరెడ్డి, పల్లికొండ యాదగిరి, కోడం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండా..



మాట్లాడుతున్న కొరిమి రాజ్‌కుమార్

భూపాలపల్లి రూరల్: దేశంలో ఎన్ని పార్టీలు ఉన్నా పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా పార్టీలేనని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని సుభాష్‌కాలనీలో కొరిమి సుగుణ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి ఏర్పడిన తర్వాత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతుంటే పార్టీ ఆధ్వర్యంలో సుభాష్ కాలనీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలనీలో రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీలు ఏర్పాటు చేసి అనేక సమస్యలకు పరిష్కారం చూపినట్లు చెప్పారు. బూర్జువా పార్టీలు డబ్బుల కోసమే రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. గెలుపోటములు సహజంగా తీసుకొని ప్రజల పక్షాన సీపీఐ పోరాడుతుందన్నారు. నిలువ నీడలేని అనేకమంది పేదలకు వేల ఎకరాల భూమిని పంచిన చరిత్ర పార్టీకి ఉందన్నారు. రాజకీయ పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయి కానీ ప్రజల పక్షాన పోరాడేది సీపీఐ మాత్రమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్, క్యాతరాజు సతీష్, నూకల చంద్రమౌళి పాల్గొన్నారు.

జాతర నిర్వహణపై అభిప్రాయాల సేకరణ



అభిప్రాయాలు తెలుపుతున్న సభ్యులు

ములుగు రూరల్: మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర అనంతరం ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న ములుగు మండలం అంకన్నగూడెం బాలగోముడు (బాలకుమారస్వామి) జాతర నిర్వహణపై ఆదివారం అభిప్రాయాలను సేకరించారు. గ్రామ వాస్తవ్యుడు డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో పూజారులు, వాటాదారులు పలు విషయాలపై చర్చించుకున్నారు. మార్చి 6 నుంచి 9వ తేదీ వరకు జాతర నిర్వహించే తేదీలను ఖరారు చేశారు. దీంతో పాటు బాలకుమారస్వామి చరిత్రను ఆదివాసీ సమాజానికి తెలియజేసే విధంగా మైపతి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సమ్మక్క–సారలమ్మ ఆర్కియాలజీ ఇండినెస్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ సభ్యులు హాజరై బాలకుమారస్వామి చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెలు అల్లం సాంబయ్య, కర్ర బొడ్డె యాపబుచ్చిబాబు, నిగమని కోటం బాలయ్య, శోభన్, కోటం సారయ్య, బాలయ్య, కన్నయ్య, సమ్మయ్య, నారాయణ, ఎంపీటీసీ ఈక సరస్వతికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిగౌడ్

ములుగు రూరల్: ఆశ వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలని యూనియన్(సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు గుండబోయిన రవిగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆశ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల పారితోషికాలను వెంటనే విడుదల చేయాలన్నారు. మేడారం జాతర సందర్భంగా విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్లకు టీఏ, డీఏ కింద రోజుకు రూ. 1000 చెల్లించాలని కోరారు. ఆశాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆరు నెలల పీఆర్సీని ఇవ్వడంతో పాటు ఏఎన్ఎం పోస్టుల్లో అర్హత కలిగిన ఆశాలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చుంచు మంజుల, రత్నం నీలాదేవి, దేవక్క, కవిత, వసంత, రాజ్యలక్ష్మి, మాధవి, సరిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

9న జిల్లా సైన్స్ డే పోటీలు

ములుగు: ఈ నెల 9వ తేదీన జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్ డే పోటీలకు ఒక్కో అంశంపై ఒక్కో పాఠశాల నుంచి ఒక విద్యార్థి హాజరయ్యేలా చూడాలని డీఈఓ అబ్దుల్ హై అధికారులకు సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు హెచ్‌ఎంలను సంప్రదించి గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ గల వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని వివరించారు. ఇతర వివరాలను జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ ఫోన్ నంబర్ 9912342270లో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక మోసాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను ఆర్థిక మోసాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అలాంటి వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ముదిరాజ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(మెపా) ఆధ్వర్యంలో ఆదివారం 8 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు వృత్తి నైపుణ్యం ద్వారా సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉద్యోగాలిప్పిస్తామని చెప్పే వారిని నమ్మొద్దని సూచించారు.

క్లుప్తంగా

డీసీఎం -స్కార్పియో వాహనం ఢీ

● మేడారం వెళ్తున్న భక్తులకు గాయాలు



కాళేశ్వరం: మహదేవపూర్– కాళేశ్వరం జాతీయ రహదారి 353(సీ) మార్గమధ్యలో డీసీఎం – స్కార్పియో వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ నుంచి ఆదివారం ఉదయం మేడారం సమ్మక్క– సారలమ్మల దర్శనానికి స్కార్పియో వాహనంలో ఓ కుటుంబం బయలుదేరింది. కాళేశ్వరం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా మహదేవపూర్ నుంచి వస్తున్న డీసీఎం – స్కార్పియో ఢీ కొన్నాయి. ఈ ఘటనలో స్కార్పియో వాహన డ్రైవర్ సురేష్ ఆత్రం, పిడుగు సహస్ర, సాహిత్యలకు స్వల్పగాయాలయ్యాయి. కాళేశ్వరం పోలీసులు గాయాలైన వారిని మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు. కాగా, స్కార్పియో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. కాళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం



హసన్‌పర్తి : కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లింది. హనుమకొండ–అంబాల మార్గ మధ్యలోని ముచ్చర్ల శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పాడి కల్పన, ఆమె భర్త ప్రతాప్‌రెడ్డి, వారి మనవడు, మనవరాళ్లు కలిసి ఆదివారం మధ్యాహ్నం నర్సక్కపల్లి నుంచి అంబాల మీదుగా పరకాలకు బయలుదేరారు. ఈ క్రమంలో కారు మార్గమధ్యలోని ముచ్చర్ల సమీపంలోని డీబీఎం–35 కాల్వలోకి దూసుకెళ్లింది.

తెరుచుకున్న ఎయిర్ బెలూన్స్..

కారు దూసుకెళ్లే క్రమంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకున్నాయి. ఈప్రమాదంలో కారులో ఉన్న వారందరూ సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.



జంపన్నవాగు షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



గద్దెల వద్ద ప్రసాదం తీసుకుంటున్న భక్తులు



జాతరకు వస్తున్న భక్తులు



గంట కొడుతున్న చిన్నారులు

తరలివచ్చి.. మొక్కులు తీర్చి





సమ్మక్క గద్దెకు వెళ్తున్న భక్తులు



ఎదురుకోళ్లు పడుతున్న భక్తురాలు



బంగారం (బెల్లం)తో భక్తులు



జంపన్నవాగులో మొక్కుతున్న భక్తులు

మేడారానికి పోటెత్తిన భక్తులు

● కిక్కిరిసిన వనదేవతల ప్రాంగణం
● ఉదయం 5 గంటకే గద్దెలకు తాళాలు
● పోలీసుల భారీ బందోబస్తు..
● ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో మేడారానికి భారీగా తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల తాకిడి పెరగడంతో అధికారులు గద్దెలకు తాళాలు వేశారు. దీంతో భక్తులు బయట నుంచి కొబ్బరి, బెల్లం, పసుపు, కుంకుమలు గద్దెల పైకి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 3 లక్షల మందికి పైగా భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ డీసీ శ్రీకాంత్‌రావు, ఈఓ రాజేంద్రం భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

అడవిలో వంటావార్పు

తల్లుల దర్శనం అనంతరం భక్తులు జాతర చుట్టు పక్కల అటవీ ప్రాంతంలోని చెట్ల కింద విడిది చేశారు. మేడారం – తాడ్వాయి 10 కిలోమీటర్లు, మేడారం – వెంగళాపూర్ 12 కిలోమీటర్ల మేరకు భక్తులు అటవీ ప్రాంతంలో చెట్ల కింద వంటావార్పు చేసుకుని ప్రకృతిని ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. వేలాది వాహనాలు రోడ్ల వెంట బారులు దీరి కనిపించాయి. అటవీ ప్రాంతం భక్తుల వంటావార్పుతో సందడిగా కనిపించింది. అడవిలోని చెట్టు, పుట్టకు కూడా పసుపు, కుంకుమ పెట్టి అమ్మవార్ల రూపంగా పూజించారు.

అధికారులు అప్రమత్తం..

మేడారానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేసి శనివారం రాత్రి నుంచే పకడ్బందీ చర్యలు చేపట్టారు. పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేసి వాహనాలను దారి మళ్లించారు. పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారం, పస్రా నుంచి నార్లాపూర్ మీదుగా మేడారానికి ప్రైవేట్ వాహనాలను మళ్లించారు. ప్రైవేట్ వాహనాలను ఎక్కడికక్కడ నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లో నిలిపివేశారు. కాగా, భక్తుల తాకిడి పెరగడంతో ఆదివారం ఉదయం 5 గంటలకే అమ్మవార్ల గద్దెలకు అధికారులు తాళాలు వేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టి, క్యూలైన్ల ద్వారా దర్శనానికి పంపించారు.

ఆర్టీసీ బస్సుల్లో 5 వేల మంది తరలింపు

మేడారానికి ఆదివారం ఆర్టీసీ బస్సుల ద్వారా 5 వేల మందిని తరలించినట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ నుంచి 60 బస్సుల్లో సుమారు 5 వేల మంది భక్తులను తరలించారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో వేల సంఖ్యలో మహిళా భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం తరలివచ్చారు. ఫలితంగా భక్తులు, బస్సుల రద్దీతో మేడారం ఆర్టీసీ బస్టాండ్ కళకళలాడింది.

పద్మశ్రీ సమ్మయ్యకు ప్రభుత్వ నజరానా

● రాష్ట్ర సర్కారు నుంచి రూ.25 లక్షల నగదు పారితోషికం
● రూ.25 వేల పింఛన్ ప్రకటన



ప్రశంసలు పొందుతున్న సమ్మయ్య

దేవరుప్పుల: పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చిందుయక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తూ నజరానా ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మవిభూషణ్, పద్మశ్రీ గ్రహీతల సత్కారంలో భాగంగా జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెకు చెందిన సమ్మయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కృష్ణారావు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విప్ వేం నరేందర్‌రెడ్డి, పద్మ విభూషణ్‌లు వెంకయ్యనాయుడు, చిరంజీవి చేతులమీదుగా రూ. 25 లక్షల నగదు పారితోషికం చెక్కు అందజేశారు. అలాగే, ప్రతి నెలా రూ.25 వేల పింఛన్‌ను ప్రకటించింది. కాగా, కేంద్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి పేద కళాకారులకు గుర్తింపు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం పురస్కార కళాకారుల జీవనప్రమాణాల మెరుగు కోసం నగదుతో పాటు ఫించన్ ప్రకటన చేయడంపై సమ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. తమకు పింఛన్ రావడానికి కృషి చేసిన కాంగ్రెస్ నాయకుడు వీహెచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరకట్న వేధింపులకు తల్లీబిడ్డ బలి

● బాలుడితో సహా వివాహిత ఆత్మహత్య
● పర్వతగిరి మండలం అన్నారం చెరువులో ఘటన
● మిల్స్‌కాలనీ స్టేషన్‌లో ఏడుగురిపై కేసు



కుమారుడితో తస్లీమ్ (ఫైల్)

ఖిలా వరంగల్/ పర్వతగిరి: వరకట్నం, శారీరక, మానసిక వేధింపులతో ఓ వివాహిత తన 7నెలల కుమారుడితో సహా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం చెరువులో మహిళ మృతదేహం లభ్యం కాగా 7నెలల బాలుడి ఆచూకీ లభించలేదు. మృతురాలి తండ్రి ఎస్.కే అఫ్జల్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. 7నెలల బాలుడి ఆచూకీ కోసం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సహకారంతో ఆదివారం గాలించగా.. బాలుడి మృతదేహం లభ్యమైంది. కాగా, కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.కె. అఫ్జల్ కుమార్తె తస్లీమ్(23)ను 19నెలల క్రితం వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ తన్వీర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.1.50లక్షలు, 3తులాల బంగారం, 26 తులాల వెండి, పల్సర్ బైక్ కోసం రూ.లక్షల ఇవ్వగా ఇంకా రూ.26వేలు ఇవ్వాల్సి ఉంది. పెళ్లి జరిగిన నెల నుంచే అదనపు కట్నం కోసం భర్త తన్వీర్, అత్త అబ్జల్ బీ, మామ మహమూద్, ఆడబిడ్డ తస్లీమా, బావ ఫారూక్, తోటికోడలు షాజహాన్, ఆడబిడ్డ భర్త జాఫర్ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈక్రమంలో ఫిబ్రవరి 1న మరో సారి అదనపు కట్నం కోసం భర్త తన్వీర్ కొట్టడంతో తస్లీమ్ అదేరోజు సాయంత్రం 7నెలల కుమారుడితో పర్వతగిరి మండలం అన్నారం దర్గా చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో పర్వతగిరి పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. అయితే మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైన వివాహిత తస్లీమ్‌గా గుర్తించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆదివారం అదే చెరువులో ఆమె కుమారుడి మృతదేహం లభ్యమైంది. ఈనేపథ్యంలో తల్లీకుమారుడి మృతికి కారణమైన నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి అఫ్జల్ ఫిర్యాదు మేరకు భర్త తన్వీర్, అత్తామామ, ఆడబిడ్డ, తస్లీమా, బావ ఫారుఖ్, తోటికోడలు షాజహా, ఆడబిడ్డ భర్త జాఫర్‌తో కలిపి ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.



అన్నారం చెరువులో మరబోట్లతో గాలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేష్, మత్స్యకారులు

చిట్‌ఫండ్ ఏజీఎం ఆత్మహత్య

కాజీపేట : హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో కనకదుర్గ చిట్‌ఫండ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నల్ల భాస్కర్ రెడ్డి (35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుబేదారి పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఎక్సైజ్ కాలనీకి చెందిన భాస్కర్ రెడ్డి కొంతకాలంగా కనకదుర్గ చిట్‌ఫండ్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది పరిచయస్తుల నుంచి డిపాజిట్లు సేకరించి సంస్థలో జమచేయించాడు. తిరిగి చెల్లింపులు చేయడానికి చిట్‌ఫండ్ యాజమాన్యం సహకరించకపోవడంతో డిపాజిట్‌దారుల ఒత్తిడి పెరిగింది. దీంతో ఒత్తిడి తట్టుకోలేక హరిత హోటల్‌లో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హోటల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం వైఖరి వల్లే తన భర్త మృతిచెందాడని మృతుడి భార్య షామిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో చిన్నకిష్టాపురంలో యువకుడు..

గార్ల: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. మానుకోట జిల్లా గార్ల మండలంల చిన్నకిష్టాపురం గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకిష్టాపురం గ్రామానికి చెందిన పూనెం రాజ్‌కుమార్(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి పూనెం సంతోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిట్యాల: వివాహితపై లైంగికదాడికి పాల్పడిన కేసులో రేగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బైకాని రాజేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దాసారపు వేణుచందర్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బైకాని రాజేందర్ ఓ వివాహితకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి అందరికీ చూపిస్తానని బెదించేవాడు. దీంతో వివాహిత చిట్యాల మండలంలోని తన తల్లిగారింటికి వచ్చింది. ఈ క్రమంలో రాజేందర్ ఆమెను వెంబడించి తనతో రావాలని, లేకుంటే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదించి, వెంట తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే మీ కుటుంబ సభ్యులను చంపివేస్తానని బెదించాడు. ఆ తర్వాత వేములవాడ, బాసర, కామారెడ్డి తదితర ప్రాంతాలకు తనతో తీసుకెళ్లాడు. ఈ క్రమంలో తనకు ప్రాణహాని ఉందని గమనించిన వివాహిత నిందితుడి నుంచి తప్పించుకుని చిట్యాల మండలంలోని తల్లిగారింటికి చేరుకుంది. జరిగిన సంఘటనపై వివాహిత తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రాజేందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై జంగిలి రమేష్, కానిస్టేబుళ్లు లాల్ సింగ్, సిద్ధార్థ, రంజిత్‌ను సీఐ వేణుచందర్ అభినందించారు.

తెగులు.. దిగులు



పూతకు సోకిన తేనెమంచు తెగులు



పూతకు సోకిన బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు

మామిడి పంటకు తెగుళ్ల బెడద

● పూత దశలో తోటలు
● ఆందోళనలో యజమానులు
● సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్: మామిడిని తెగుళ్ల బెడద వెంటాడుతోంది. తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఫలితంగా తోటల యజమానులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్‌లో ప్రారంభమయ్యే పూత దశ ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. అయితే తోటలకు సంబంధించిన 'పూత'ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తెగుళ్లను ప్రారంభంలోనే నియంత్రించాలి..

మామిడి చెట్లకు పూత మొదలవగానే ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్ల ఆనవాళ్లు కనపడగానే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వాతావరణంలో వస్తున్న మార్పులకనుగుణంగా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తూ వారి సలహాలు, సూచనలు పాటించాలి. పూత దశలో వచ్చే తెగుళ్లను ముందుగా గుర్తించాలి.

మామిడిలో వచ్చే తెగుళ్లు ఏవంటే..

మామిడి తోటలు పూత దశలో ఉన్నప్పుడు ఎక్కువగా బూడిద, నల్లమచ్చ తెగుళ్లు, తేనెమంచు, తామర, పూత పురుగులు వస్తుంటాయి. అవి పూతకు సోకితే కాయ దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది.

బూడిద తెగులు.. నివారణ చర్యలు..

మామిడి పూత దశలో ఉన్నప్పుడు వాతావరణం రాత్రి పూట చల్లగా, పగటి పూట వెచ్చగా ఉన్నప్పుడు ఈ తెగులు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో పూత కాండం, పూత, పిందెలపై పొడి లాంటి బూజు పదార్థంగా చేరడంతో పూత, కాత రాలిపోతుంది. ఈ తెగులు నివారణ కోసం మొగ్గలు కనిపించే దశలో మొతాదును బట్టి గంధకం, హెక్సకోనాజోల్, ప్రొపికోనాజోల్, డినోకాప్, ట్రైడిమాల్స్ మందులు పిచికారీ చేయాలి.

నల్లమచ్చ తెగులు..నివారణ..

పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో ఈ తెగులు విజృంభిస్తుంది. ఇది మొదట లేత ఆకులు, పూలను ఆశించడంతో ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోతాయి. రెమ్మలపై కూడా నల్లని మచ్చలు ఏర్పడి పూతగుత్తులు, పూలు మాడిపోయి కాయలు రాలిపోతాయి. నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగులబెట్టాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్, బోర్డో కలిపి పిచికారీ చేయాలి. కార్బండిజం, థయోఫినేట్ లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగు..నివారణ..

మామిడిలో తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాండాలు,పూలు, లేత పిందెల నుంచి రసం పీల్చడంతో ఆకుల చివర్లో మాడిపోయి పూత మాడిపోవడమే కాకుండి పిందెలు రాలిపోతాయి. ఆకులు, కాండం, కాయలపై మసి పొర ఏర్పడుతుంది. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, డైక్లోరవాస్, డైమెథోయేట్, జిథైల్‌డెమటాన్, ఇమిడాక్లోప్రైడ్ లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



మామిడిపూత

మామిడి చెట్లు ఉన్న భూమిలో తేమ కోసం పూత వచ్చిన తర్వాత ప్రతి 10–15 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి. చలి ఎక్కువగా ఉంటే పూత రావడం ఆలస్యమవుతుంది. అందుకే పొటాషియం, నైట్రేట్, యూరియా మోతాదు ప్రకారం కలిపి పిచికారీ చేయాలి. పూత సమయంలో కొమ్మ కత్తిరించడం, దున్నడం లాంటి పనులు చేయొద్దు.


పూత పురుగు..నివారణ..

మామిడిలో ఈ పురుగు అరుదుగా కనిపిస్తుంది. తల్లి పురుగు గుడ్లు పెట్టడం ద్వారా వచ్చిన పిల్ల పురుగులు పూల కాడలోకి చొచ్చుకుపోయి కాడ భాగాన్ని తినడంతో పూల కాడలు వంగిపోయి, ఎండిపోయి పూత రాలిపోతుంది. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, ఎసిఫేట్, పాస్ఫమిడాన్, డైక్లోరవాస్ లాంటి మందులు అవసరం మేరకు పిచికారీ చేయాలి.

తామర పురుగు..నివారణ..

మామిడి పంట పూత సమయంలో తామర పురుగు రసం పీల్చడంతో పూత ఎండిపోయి రాలిపోతుంది. ఇది మామిడితోపాటు మిరప పంటలను కూడా నష్టపరుస్తుంది. తామర.. మంచు పురుగులు, మంగు తెగులును వ్యాప్తి చెందేలా చేస్తుంది. నివారణ కోసం ఇమిడాక్లోప్రైడ్, థయామితగ్జాం లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

రైతులు పూతను గమనించాలి..



మామిడి పూత దశలో ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ఎప్పటికప్పుడు పూతను గమనించాలి. పూత, కాండంలను పరిశీలిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. పూతలో ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటించాలి. అవసరమైన మందులు పిచికారీ చేసి మామిడి పంటను రక్షించుకోవాలి.

డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు